

సోమశిలలో 7.61 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 7.615 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.76,490
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,851
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,056
నవర (8 గ్రాములు)	రూ.56,448



వరుస ప్రమాదాలతో హడల్

జిల్లా పరిధిలోని రహదారులపై ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. దీంతో వాహనదారులు హడలిపోతున్నాయి.

8లో

పాఠ్యపుస్తకాలొచ్చేశాయ్..



పాఠ్య పుస్తకాలు

గత టీడీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉండేది. పాఠ్య పుస్తకాల కోసం విద్యార్థులు పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. విద్యా సంవత్సరం ముగిసే దశలోనూ పూర్తి స్థాయిలో ఇవి అందేవికావంటే క్షేత్రస్థాయిలో సమస్య తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ తరుణంలో 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. నాడు – నేడుతో మౌలిక వసతులు.. విద్యాకానుక పేరుతో విద్యార్థులకు తొమ్మిది రకాల వస్తువులు.. జగనన్న గోరుముద్ద.. తదితర పథకాలతో ప్రభుత్వ పాఠశాలల వైపు ఎక్కువ మంది మొగ్గు చూపేలా చర్యలు చేపట్టారు. తాజాగా పాఠశాలల పునఃప్రారంభం నాటికే పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలను అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.





స్కూళ్ల పునఃప్రారంభానికి ముందే జిల్లాకు చేరిన వైనం

- 8 నుంచి పదో తరగతి వరకు నేరుగా మండల పాయింట్లకు
- ఒకటి నుంచి ఏడు వరకు జిల్లా స్టాక్ పాయింట్‌కు
- నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో రాక

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందులో భాగంగా ఈ విద్యాసంవత్సరంలో స్కూళ్ల పునఃప్రారంభం నాటికే పాఠ్య పుస్తకాలను పూర్తి స్థాయిలో అందించేలా కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పుస్తకాలు జిల్లాకు తొలి విడతలో ఇప్పటికే చేరుకున్నాయి. మరో రెండు విడతల్లో పూర్తి స్థాయిలో రానున్నాయి. జిల్లాకు 22.5 లక్షల పాఠ్య, నోట్ పుస్తకాలు అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారులు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఇండెంట్ పంపారు.

జిల్లాలో 2637 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలో 3449 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వీటిల్లో ప్రభుత్వానికి సంబంధించి 1961 ప్రాథమిక, 240 ప్రాథమికోన్నత, 316 ఉన్నత.. మున్సిపల్‌కు సంబంధించి 60 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, 19 ఉన్నత.. ఎయిడెడ్‌కు సంబంధించి 19 ప్రాథమిక, నాలుగు ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 2637 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 2.62 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

పంపిణీ ఇలా..

ఒకటి నుంచి ఏడో తరగతి వరకు 8.04 లక్షల పుస్తకాల అవసరం ఉంది. ఇప్పటి వరకు జిల్లాలోని స్టాక్ పాయింట్‌కు 3.51 లక్షల పుస్తకాలు చేరుకున్నాయి. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు 6.46 లక్షల పుస్తకాలకు గానూ ఇప్పటి వరకు దాదాపు మూడు లక్షల పాఠ్య పుస్తకాలను మండల స్టాక్ పాయింట్లకు చేర్చామని జిల్లా విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. వీటితో పాటు గతేడాది 1.41 లక్షల పాఠ్య పుస్తకాలు మిగిలాయి. పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశాన్ని ఒకవైపు తెలుగు, మరోవైపు ఇంగ్లిష్ మీడియంలో ముద్రించారు. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు సీబీఎస్‌ఈ సిలబస్‌లో ముద్రించారు. మిగిలిన పుస్తకాలు ఈ నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో రానున్నాయని చెప్తున్నారు.

తొలి విడతలో 6.5 లక్షల పాఠ్య పుస్తకాలు

జిల్లాకు తొలి విడతలో 6.5 లక్షల పాఠ్య పుస్తకాలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు పంపారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు అవసరమైన పాఠ్య పుస్తకాలను జిల్లా స్టాక్ పాయింట్లకు పంపుతున్నారు. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు సంబంధించిన పాఠ్య పుస్తకాలను ప్రింటర్ల నుంచి నేరుగా మండల స్టాక్ పాయింట్లకు చేరవేస్తున్నారు.

పాఠశాలలు తెరిచిన రోజే పుస్తకాల అందజేత

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. జిల్లాలో ప్రస్తుతం 7.5 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పాఠశాలలను వచ్చే నెల 12న పునః ప్రారంభించనున్నారు. ఆ రోజే విద్యార్థులందరికీ పుస్తకాలిచ్చేలా చర్యలు చేపట్టాం. వచ్చే నెల పది నాటికి మండల స్టాక్ పాయింట్ల నుంచి పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను చేరుస్తాం. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలతో పాటు వర్క్‌బుక్‌లు.. ఆరు నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలను అందజేయనున్నాం.

– రామారావు, డీఈఓ

ఆర్టీసీ బస్సుల ద్వారా సరఫరా

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలను ఆయా స్టాక్ పాయింట్లకు ఆర్టీసీ బస్సుల ద్వారా పంపిస్తున్నారు. అక్కడి నుంచి పాఠశాలలకు చేర్చనున్నారు. గతేడాది తరహాలో ఈ సంవత్సరం సైతం ఆర్టీసీ ద్వారానే సరఫరా చేసేలా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.

న్యూస్‌రీల్

పెట్రోల్, డీజిల్ లూజు విక్రయాలపై నిషేధం

నెల్లూరు(క్రైమ్): జూన్ నాలుగున ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు భద్రత చర్యలు చేపట్టామని వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెట్రోల్, డీజిల్ లూజు విక్రయాలు నిషేధమని, ఈ మేరకు జిల్లాలోని పెట్రోల్ బంకు యజమానులకు నోటీసులను జారీ చేశామని వివరించారు. ఆదేశాలను ఉల్లంఘించి ఉదయగిరిలో లూజు విక్రయాలకు పాల్పడిన పెట్రోల్ బంకు యజమాని, కొనుగోలు చేసిన బండగానిపల్లికి చెందిన వ్యక్తులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కమనీయం ప్రసన్న విశ్వేశ్వరుడి కల్యాణం



ఇందుకూరుపేట: మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరుడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కల్యాణోత్సవాన్ని కనులపండువగా గురువారం నిర్వహించారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్ శర్మ ఆధ్వర్యంలో వేడుకను జరిపారు. ఉభయకర్తలుగా గంపల రామసుబ్బయ్య, వారి కుమారులు వ్యవహరించారు. అనంతరం గజవాహనసేవ వేడుకగా సాగింది. ఆలయ చైర్మన్ కనుపూరు సురేంద్రబాబు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లో పరిశీలన



నెల్లూరు (దర్గామిట్ట): కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలో ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ గురువారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లను సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ చేస్తున్న కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కనులపండువగా రథోత్సవం



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రథోత్సవాన్ని వేడుకగా గురువారం నిర్వహించారు. ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను జరిపారు. ఉభయకర్తలుగా భారతిరెడ్డి, శ్రీకళ, మాధవీలత వ్యవహరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఈఓలు గిరికృష్ణ, కృష్ణప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నెల్లూరు(బృందావనం): వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఉభయకర్తలుగా సోమేశ్వర దీక్షిత్ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

అంతటా అప్రమత్తం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో సంతపేట ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

- కొనసాగుతున్న కార్డన్ సెర్చ్

నెల్లూరు(క్రైమ్): రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు భద్రత చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ పేరిట తనిఖీలను నిర్వహిస్తున్నారు. అనుమానితులు, పాతనేరస్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్‌ను బైండోవర్ చేస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు వేళ అల్లర్లు జరగకుండా ముందస్తు భద్రత చర్యలు చేపట్టారు. సాయుధ బలగాలతో కలిసి కవాతు నిర్వహించడంతో పాటు అక్కడి ప్రజలతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా జలదంకి, ఉదయగిరి, దుత్తలూరు, కందుకూరు రూరల్, టీపీ గూడూరు, కలిగిరి, వరికుంటపాడు, సీతారామపురం, కొడవలూరు, వింజమూరు పరిధిలో తనిఖీలను గురువారం నిర్వహించారు. సరైన పత్రాల్లేని 22 బైక్‌లు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.

- సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీగిరిజన కాలనీలో తనిఖీలను స్థానిక ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో చేపట్టారు. ప్రతి ఇంటినీ జల్లెడ పట్టారు. సరైన పత్రాల్లేని 12 బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఓట్ల లెక్కింపు వేళ అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లాలో 80 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 25,929 మంది విద్యార్థులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐఓ శ్రీనివాసులు (ఫైల్)

నెల్లూరు (టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షలను శుక్రవారం నుంచి వచ్చే నెల ఒకటి వరకు నిర్వహించనున్నారు. మొత్తం 80 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సర పరీక్షలను ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 వరకు.. ద్వితీయ సంవత్సర పరీక్షలను మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరపనున్నారు. ప్రథమ సంవత్సరానికి గానూ 20,317.. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 5612 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు గానూ జిల్లా ఇంటర్ బోర్డు కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. 0861 – 2320312 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే సమస్యలను వెంటనే పరిష్కరించనున్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాను 27 జోన్లుగా విభజించారు.

పకడ్బందీగా నిర్వహణ

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లు, మూడు సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు జిల్లా పరీక్షల కమిటీ విభాగం పరిశీలించనుంది. కమిటీలో కన్వీనర్‌గా ఆర్ఐఓ శ్రీనివాసులు, సభ్యులుగా దీన్‌దయాళ్, వేణుగోపాల్, కొండయ్యను నియమించారు. 80 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 80 మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. పరీక్షలు జరిగే ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు చేయనున్నారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను మూసేయాలని ఆదేశించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరగనున్నాయి. ప్రతి కేంద్రంలో ఏఎన్ఎంతో పాటు మెడికల్ కిట్‌ను ఏర్పాటు చేశారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి


ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. పరీక్ష కేంద్రాలకు గంట ముందే విద్యార్థులు చేరుకోవాలి. మాస్ కాపీయింగ్ జరగకుండా ఉండేందుకు స్క్వాడ్లను ఏర్పాటు చేశాం.

– శ్రీనివాసులు, ఆర్ఐఓ

అరాచకాలను ఏమార్చేందుకు..

ఎన్నికల్లో పరాజయం తప్పదనే అంశం టీడీపీ నేతలకు అవగతమైంది. తమదే విజయమంటూ నిన్నామొన్నటి వరకు బీరాలు పలికిన ఆ పార్టీ నేతలకు క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. ఈ తరుణంలో ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, నేతలు దౌర్జన్యాలకు పాల్పడ్డారంటూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారంటే వారి పరిస్థితి ఏమిటో అర్థమవుతోంది. వీరి నిరాధార ఆరోపణలకు పచ్చ మీడియా వంతపాడుతోంది.

- పోలింగ్ రోజున జిల్లా వ్యాప్తంగా టీడీపీ నేతల గూండాగిరి
- ఫుటేజీలను పరిశీలిస్తే తమ పరిస్థితి ఏమిటనే గుబులు
- నిరాధార ఫిర్యాదులతో పబ్బం
- ఎన్నికలైన పది రోజుల తర్వాత వైఎస్సార్సీపీపై ఆరోపణలు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కళ్ల ముందే ఓటమి కనిపించినా.. ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో అధికారులనే కాకుండా ఓటర్లను పచ్చమూకలు ప్రలోభపెట్టారు. పోలింగ్ రోజున అనేక బూత్‌లలో దౌర్జన్యాలు చేశారు. టీడీపీ అరాచకాలను అడ్డుకున్న వైఎస్సార్సీపీ నేతలపై గూండాయిజం చెలాయించారు. ఇవన్నీ పోలింగ్ బూత్‌లలో వెబ్ కెమెరాల్లో రికార్డయ్యాయి. అయితే ఎన్నికల అధికారులకు ఇవి కనిపిస్తున్నా.. నిస్సహాయ స్థితిలో మౌనం దాల్చారు.

పచ్చమీడియాను అడ్డంపెట్టుకొని..

జిల్లాలో పచ్చమీడియాను అడ్డం పెట్టుకొని పోలింగ్ రోజున దౌర్జన్యాలకు టీడీపీ తెగబడింది. ప్రధానంగా నెలూరు రూరల్, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, కందుకూరు, కోవూరు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు దాడులకు పాల్పడిన విషయం విదితమే. అయితే ఆది నుంచి ఎన్నికల ప్రక్రియను టీడీపీ ప్రభావితం చేస్తూ వచ్చింది. ఓటమి భయంతో సదరు అధికారి వైఎస్సార్సీపీకి అనుకూలమంటూ.. ఏదో జరిగిపోతోందంటూ జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగాన్ని ప్రభావితం చేస్తూ ఈసీకి టీడీపీ ఫిర్యాదులు చేసింది. దీంతో పచ్చమీడియా సైతం చెలరేగిపోయింది.

టీడీపీ దాష్టీకాలకు అడ్డేదీ..?

ఎన్నికల పర్యవేక్షణాధికారులను బ్లాక్ మెయిల్ చేస్తూ పోలింగ్‌ను తమకు అనుకూలం చేసుకునేందుకు టీడీపీ తొక్కని అడ్డదారుల్లేవు. దీంతో పోలింగ్ రోజున పోలీసులు సైతం టీడీపీ అరాచకాన్ని వదిలేశారు. ఎక్కడా కేసులు నమోదు చేసిన దాఖలాల్లేవు. కావలిలోని ముసునూరు, అల్లూరు మండలం బీరంగుంట, దగదర్తి మండలం తడకలూరులో వైఎస్సార్సీపీ కార్యకర్తలపై దాడులు చేసి, వారి వాహనాలను ధ్వంసం చేశారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు వద్ద వైఎస్సార్సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డిపై టీడీపీ నేతలు దాడికి యత్నించారు. కందుకూరు నియోజకవర్గం ఉలవపాడులో పార్టీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌పై టీడీపీ వర్గీయులు దాడికి తెగబడ్డారు.

భయంతో నిరాధార ఆరోపణలు

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లలో టీడీపీ ఏజెంట్లు, స్థానిక నేతలు దౌర్జన్యానికి తెగబడ్డారు. విషయాన్ని తెలుసుకున్న విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి అక్కడికెళ్లి పచ్చమూకల దౌర్జన్యాన్ని అడ్డుకున్నారు. ఇదంతా సీసీ టీవీ ఫుటేజీల్లో రికార్డయ్యాయి. దీనిపై ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్సీపీ ఫిర్యాదు చేయడంతో సిట్‌తో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో తమ దాష్టీకాలు బయటకొస్తాయనే భయంతో నిరాధార ఫిర్యాదులు చేసేందుకు టీడీపీ నేతలు తెగబడ్డారు.

అవాస్తవాల వ్యాప్తి

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పలు బూత్‌లలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు, కార్పొరేటర్లు దౌర్జన్యాలు చేశారంటూ ప్రిసైడింగ్ అధికారికి బూత్ ఏజెంట్లతో టీడీపీ నేతలు ఫిర్యాదు చేయించారు. పల్నాడు తరహాలో ఇక్కడా దారుణాలు జరిగిపోయాయంటూ పచ్చ మీడియా అవాస్తవాలను వ్యాప్తి చేసింది. ఒకవేళ వైఎస్సార్సీపీ నేతలు దౌర్జన్యానికి పాల్పడి ఉంటే అప్పుడే ఎన్నికల అధికారికి ఎందుకు ఫిర్యాదు చేయలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు సైతం టీడీపీ అభ్యర్థి కాకుండా.. పోలింగ్ ఏజెంట్లతో ఫిర్యాదు చేయించారంటే వాస్తవాలేమిటో అర్థమవుతోంది.

వెంటాడుతున్న భయం

ఎన్నికల్లో టీడీపీ అక్రమాలపై కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. ఈ తరుణంలో వైఎస్సార్సీపీ నేతల ఫిర్యాదులపై అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందనే భయంతో టీడీపీ నేతలు ఇలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ రోజున సీసీ టీవీ ఫుటేజీలను బయటకు తీస్తే దోషులెవరో తెలుస్తుందని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని వైఎస్సార్సీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు



హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని.. కౌంటింగ్ సజావుగా పూర్తయ్యేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ నాలుగో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభంకానుందని, రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు గంట ముందే చేరుకోవాలని కోరారు. కౌంటింగ్ ఏజెంట్ లేదా అభ్యర్థి సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ల సీల్‌ను ఓపెన్ చేస్తామని చెప్పారు.

నలుగురు పరిశీలకుల నియామకం

కౌంటింగ్‌ను పరిశీలించేందుకు నలుగురు పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించిందన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతిలేదని, డిపాజిట్ కేంద్రంలో అందజేశాకే లోపలికి రావాల్సి ఉంటుందని చెప్పారు. కౌంటింగ్ కేంద్ర బయట జెడ్పీ హైస్కూల్లో వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. అభ్యర్థుల వాహనాలతో పాటు అన్నింటిని అక్కడి వరకే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపునకు 14 ఈవీఎం టేబుళ్లతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు మరో రెండు టేబుళ్లు, ఒక ఆర్వో టేబుల్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒక్కో టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని వివరించారు.

ఫారం – 18ను ఆర్వోలకు అందజేయాలి

కౌంటింగ్ ఏజెంట్లకు సంబంధించిన ఫారం – 18ను ఆర్వోలకు జూన్ ఒకటో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు అందజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. రోజూ ఉదయం 11.. మధ్యాహ్నం మూడు.. రాత్రి ఏడు గంటలకు స్ట్రాంగ్ రూమ్‌లకు వేసి ఉన్న సీల్‌ను పరిశీలించుకోవచ్చని తెలిపారు. డీఆర్వో లవన్న, వైఎస్సార్సీపీ తరఫున సుబ్బారావు, టీడీపీ నుంచి సురేంద్రబాబు, బీజేపీ తరఫున శ్రీనివాస్, సీపీఎం నుంచి అజయ్, కాంగ్రెస్ నుంచి బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు.. ఆరిపోతున్న దీపాలు

జిల్లాలో జాతీయ, గ్రామీణ రహదారుల్లో వరుస ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొందరు వాహనచోదకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం ప్రమాదాలకు కారణమవుతోంది. ఆయా దుర్ఘటనల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయి కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపుతున్నారు. మరి కొందరు శాశ్వత వైకల్యం బారిన పడి జీవితాంతం బాధ పడుతున్నారు.

నిత్యం నెత్తురోడుతున్న హైవేలు, రాష్ట్ర రహదారులు

- ఒకరి నిర్లక్ష్యం.. మరొకరికి ప్రాణసంకటం
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు
- ఐదునెలల్లో 50 మందికిపైగా మృత్యువాత


సున్నపుబట్టి వద్ద ప్రమాద స్థలంలో బస్సు (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో ఐదునెలల వ్యవధిలో పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. సుమారు 50 మందికిపైగా మృత్యువాత పడగా, వందమందికి పైగా క్షతగాత్రులయ్యారు. వేగని యంత్రణ అమలు చేయకపోవడం, బ్లాక్‌స్పాట్‌ల వద్ద నిర్దిష్ట చర్యలు చేపట్టకపోవడం, రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ఆచరణలో పెట్టకపోవడంపై అధికారులు పునః సమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కారణాలెన్నో..

మితిమీరిన వేగం, మద్యం మత్తు, ఓవర్‌టేక్, అకస్మాత్తుగా వాహనం నిలపడం, ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణ, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం తదితరాలు ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రధానంగా జాతీయ రహదారులపై లారీలను ఇష్టానుసారంగా నిలిపేస్తున్నారు. హోటళ్లు, దాబాలు, ఇతర దుకాణాల వద్ద హైవేకి అనుకుని ఆపుతున్నారు. ఈ క్రమంలో వెనుక వచ్చే వాహనాలు వేగాన్ని నియంత్రించలేక వాటిని ఢీకొంటున్నాయి. లారీలను ఎక్కడపడితే అక్కడ నిలపకుండా విశ్రాంతి స్థలాల్లో మాత్రమే నిలపాల్సి ఉన్నా అక్కడ సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉండటంతో రోడ్లకు ఆనుకుని, చెట్ల కింద ఆపడం ద్వారా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రైవేట్ బస్సులు అధికంగా రాత్రి వేళ తిరుగుతుంటాయి. ఈక్రమంలో అందులో క్లీనర్‌గా పనిచేసేవారు అరకొర డ్రైవింగ్‌తో అప్పుడప్పుడు వాహనాలు నడుపుతున్నారు. రాత్రివేళ ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించడం, ముందు వెళ్తున్న వాటిని వేగంగా అధిగమించే క్రమంలో పట్టుకోల్పోయి ప్రమాదాలకు కారణమవుతున్నారు.

జిల్లాలో..

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	943	398 మంది	944 మంది
2021	977	466 మంది	1,006 మంది
2022	890	432 మంది	1,032 మంది
2023	883	408 మంది	998 మంది
2024 (ఇప్పటి వరకు)	120కి పైగా	50 మందికి పైగా	వందల్లో..

తీర్మానం చేసినా..

జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే 70 బ్లాక్‌స్పాట్లను అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఇసుక డ్రమ్ములు, బారికేడ్లు, రహదారుల మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు, సోలార్ విద్యుద్దీపాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని రోడ్ సేఫ్టీ సమావేశాల్లో తీర్మానించారు. అది కార్యరూపం దాల్చినా కేవలం, ఒకటి రెండు చోట్లకే పరిమితమైంది. అనంతరం అధికారులు అటువైపుగా దృష్టిసారించిన దాఖలాల్లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిద్రమత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటాయని అధికారులు గతంలో గుర్తించారు. వాహన డ్రైవర్లను మేలుకొల్పేలా వాష్ అండ్ గో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పట్లో ప్రమాదాలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. అయితే కాలక్రమంలో ఆ కార్యక్రమానికి బ్రేక్ పడింది.


ఆత్మకూరు : 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులు

ఇలా చేస్తే..

జాతీయ రహదారి వెంబడి ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా చూడాలి. నిబంధనల మేరకు ముందు, వెనుక వాహనాలకు రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లు అతికించాల్సి ఉంది. ఇవి రాత్రి వేళల్లో వాహనచోదకునికి ముందు వాహనం ఉందనే విషయాన్ని స్పష్టంగా కనిపించేలా చేస్తుంది. వేగనియంత్రణ, మద్యం మత్తులో వాహనాలు నడపకుండా చూడాలి. అతివేగంతో దూసుకెళ్తున్న వాహనాలను నిఘా కెమెరాలతో గుర్తించి వెంటనే క్లెయిం వేయాలి. సంబంధిత వాహన యాజమాని సెల్‌ఫోన్‌కు సందేశం పంపి అప్రమత్తం చేయాలి. బ్లాక్‌స్పాట్లలో సూచిక బోర్డులు, విద్యుద్దీపాలు, రహదారి మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించేలా చూడాలి. రోడ్డు సేఫ్టీ కమిటీ నిర్ణయాలను అమలు చేయాలి. వాష్ అండ్ గో కార్యక్రమాన్ని పునః ప్రారంభించాలి. ప్రైవేటు బస్సులపై ప్రత్యేక దృష్టిసారించాలి. నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలి. అనుభవం లేని డ్రైవర్లు వాహనాలు నడుపుతుంటే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలి. శిక్షణ పొందిన డ్రైవర్లే బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలి. మోటార్‌బైక్‌లు నడిపే వారు విధిగా హెల్మెట్, కారులోని వారు సీట్ బెల్ట్ ధరించేలా చూడాలి. నిబంధనల ఉల్లంఘనులపై చర్యలు తీసుకోవాలి. రహదారి భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

ఏప్రిల్, మే నెలల్లో జరిగిన కొన్ని ప్రమాదాలు

- ఈ ఏడాది ఏప్రిల్ 4వ తేదీన పొదలకూరులో పనిముగించుకుని మోటార్‌బైక్‌పై వస్తున్న రామయ్య, సీమయ్య, తవిటయ్యలను మరో బైక్ వేగంగా ఢీకొనడంతో మృతిచెందారు.
- 16వ తేదీన కావలి రూరల్ మండలం గౌరవరం వద్ద ఆగి ఉన్న లారీని కారు వేగంగా ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న జలదంకి మండలం చాముదలకు చెందిన శ్రీనివాసులు, వరలక్ష్మి, లక్ష్మమ్మ, నీలిమ, నందు చనిపోయారు.
- ఈనెల 4వ తేదీన అనుమసముద్రంపేటలోని చందులూరుపాడు వద్ద రెండు మోటార్‌బైక్‌లు ఢీకొనడంతో సంగం మండలం పెరమన గ్రామానికి చెందిన తుమ్మల శివయ్య (30) అనే వ్యక్తి చనిపోయాడు.
- 7వ తేదీన మనుబోలు బైపాస్‌రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో 25 – 30 సంవత్సరాల మధ్య వయసున్న ఓ యువకుడు చనిపోయాడు.
- 8వ తేదీన ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి అడ్డరోడ్డు సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై మోటార్‌బైక్‌పై వెళ్తున్న అనంతసాగరం మండలం దేవరాయపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ (24)ను ఎదురు నుంచి లారీ ఢీకొనడంతో మృతిచెందాడు.
- 10వ తేదీన మనుబోలు బైపాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్లకూరు మండలానికి చెందిన ఇద్దరు యువకులు చనిపోయారు.
- 18న కొడవలూరు మండలం టపాతోపు వద్ద ఆగి ఉన్న లారీని కారు వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి.
- 19వ తేదీన గంగవరం కాలువవద్ద ఆగిఉన్న లారీని బస్సు వేగంగా ఢీకొంది. దీంతో బస్సులోని ప్రయాణికులు మరియమ్మ, దావీద్‌లు మృతిచెందారు.
- 22వ తేదీన దగదర్తి మండలం సున్నపుబట్టి జాతీయ రహదారిపై కంటైనర్ లారీని ఢీకొని ప్రైవేటు బస్సు బోల్తాపడింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా, పలువురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి.
- 22న ఆత్మకూరు మండలంలోని దేపూరు అడ్డరోడ్డు వద్ద ట్రక్కు మోటార్‌బైక్‌ను ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు.


కోవూరు: ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు (ఫైల్)

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.25

కమనీయం.. నారసింహుని పరిణయోత్సవం

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో గురువారం లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మిల పరిణయోత్సవం నయనానందకరంగా సాగింది. ఇదే ముహూర్తంలో పలు జంటలు ఒక్కటయ్యాయి. ఉదయం శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. మండపంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేక హుండీల్లో భక్తులు చదివింపుల కానుకలుగా రూ.83,720 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. రాత్రి ఏడు గంటలకు రథంపై స్వామి, అమ్మవార్లు కోన తిరువీధుల్లో విహరించారు. శ్రీవారి కల్యాణోత్సవాన్ని చూసేందుకు ఈ ఏడాది అశేషంగా భక్తులు తరలిరావడంతో పెంచలకోన కిక్కిరిసింది. కార్యక్రమాల్లో డీసీ విజయసాగర్‌బాబు, ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, దేవుడు వెల్లంపల్లి ఈఓ శ్రీధర్, సీఐ సుబ్రహ్మణ్యం, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి, టీడీడీ పాంచరాత్ర ఆగమపండితులు రామానుజాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం, తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు వసంతోత్సవం, 9 గంటలకు చక్రస్నానం, స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, 9 గంటలకు అశ్వవాహనసేవ, 11 గంటలకు ధ్వజావరోహణం ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

క్లూస్‌టీం పరిశీలన

ఉదయగిరి: పట్టణంలోని బాలాజీనగర్‌లో నివాసముంటున్న రేకలగుంట పోలయ్య అనే వ్యక్తి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తుల చోరీకి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం క్లూస్‌టీం ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించింది. పోయిన వస్తువుల గురించి పోలీసులు అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో ఎవరూ లేని విషయం తెలుసుకున్న వ్యక్తులు దొంగతనానికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో క్లూస్‌టీంకు చెందిన బి.సునీల్, వినయ్ పాల్గొన్నారు.



మినీ లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మర్రిపాడు: మినీ లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఓ వ్యక్తి ప్రాణం పోయిన ఘటన మండలంలోని సింగన్నపల్లి జాతీయ రహదారిపై గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కావలి మండలం ముసునూరుకు చెందిన టి.వేణుగోపాల్‌రెడ్డి (40) మర్రిపాడు మండలం బూదవాడకు చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. రెండురోజుల క్రితం అతను తన భార్యతో కలిసి అత్త ఇంటికి వచ్చాడు. గురువారం పనినిమిత్తం వేణుగోపాల్‌రెడ్డి మోటార్‌బైక్‌పై పీపీకుంటకు వెళ్లాడు. పని ముగించుకుని ఇంటికి బయలుదేరి సింగన్నపల్లి వద్దకు చేరుకున్నాడు. అదే సమయంలో ఉదయగిరి నుంచి బద్వేల్‌కు మినీ లారీ వెళ్తోంది. దాని డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకుని బైక్‌ను వేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో వేణుగోపాల్‌రెడ్డి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ మినీలారీని ఘటనా స్థలంలోనే వదిలి పరారయ్యాడు. సమాచారం అందుకున్న మర్రిపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆత్మకూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వేణుగోపాల్‌రెడ్డి మృతదేహం

సుందరీకరణ పనుల పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగర సుందరీకరణ పనుల్లో భాగంగా స్థానిక ముత్తుకూరు రోడ్డు కూడలి సర్వేపల్లి కాలువ కట్టపైన నూతనంగా నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ గురువారం పరిశీలించారు. పనులను ప్రణాళికాబద్ధంగా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు సంజయ్, ముజాహిద్దీన్, ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలను అపహరించే ముఠా అరెస్ట్

వరికుంటపాడు: వరికుంటపాడు మండలంలో గొర్రెలను అపహరించే ముఠాను గురువారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు స్థానిక ఎస్సై కె.తిరుపతయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని ఇస్కపల్లె గ్రామంలోని పెన్నా సుబ్బారావు తన గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ చేపట్టారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడకు చెందిన ముద్రబోయిన గోవింద్, గణేష్, దుర్గా, వనిపెంట మోహన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు గొర్రెలను, ఇంకా ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

భర్త వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

వరికుంటపాడు: భర్త నిత్యం చిత్రహింసలకు గురిచేస్తున్నాడని వరికుంటపాడు మండలం నల్లబోతులవారిపల్లె గ్రామానికి చెందిన బండారు సరస్వతి వరికుంటపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కె.తిరుపతయ్య గురువారం వివరాలు వెల్లడించారు. సరస్వతికి ఆరు సంవత్సరాల క్రితం ఉదయగిరి మండలం సున్నంవారిచింతల గ్రామానికి చెందిన బండారు ప్రవీణ్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. జీవనోపాధి కోసం ఆ కుటుంబం తెలంగాణ రాష్ట్రంలో ఉంటూ అప్పుడప్పుడూ ఇక్కడకు వస్తుండేది. కాగా పెళ్లి జరిగిన కొంతకాలం నుంచి భార్యపై ప్రవీణ్ అనుమానం పెట్టుకున్నాడు. కట్నం తీసుకురాలేదని హింసించేవాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. నెలరోజుల క్రితం సరస్వతి బంధువుల ఇంట్లో శుభకార్యం నేపథ్యంలో ఎన్‌బీ కాలనీకి వచ్చి కొన్ని రోజులుండి ఈనెల 17న తెలంగాణలోని జమ్మికుంటలో ఉంటున్న భర్త వద్దకు వెళ్లింది. 20న అతను మద్యం తాగి భార్యను చిత్రహింసలకు గురిచేశాడు. దీంతో ఆమె పిల్లలతో 22న ఎన్‌బీ కాలనీ వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రవీణ్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.